క్లుప్తంగా

పేదలకు అండగా ఉంటా



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: పేదలకు అండగా ఉంటానని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యం, విద్యకు పెద్ద పీటీ వేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు స్వయంగా వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్‌వోసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం ఏంటని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖపై పూర్తి అవగాహన ఉన్న వారికి విద్యాశాఖ మంత్రి ఇవ్వాలని, రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యను వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథ్, బీసీ ఐక్యవేదిక కన్వీనర్ రంగు క్రాంతి, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అఖిల్, రాష్ట్ర కార్యదర్శి జంగిటి నిఖిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగిల్, అఖిల్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

రామగిరి: బేగంపేట సెక్షన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం తమ సిబ్బందితో కలిసి కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా కార్యాలయంలో వచ్చి దరఖాస్తు అందజేయాలన్నారు. అలాగే నూతన విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, తమ సిబ్బంది పరిశీలించి కనెక్షన్ ఇస్తారని పేర్కొన్నారు. ప్రతి సోమవారం రత్నాపూర్ గ్రామంలోని బేగంపేట సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఓదెల మండలం పొత్కపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, నాయకులు రాహుల్, రతన్, రఘు శనివారం డీఈవో మాధవికి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధగా నిర్మించిన భవనంలోకి అనుమతి లేకుండానే పాఠశాలను మార్చారని ఆరోపించారు. అతేకాకుండా పాఠశాల పేరిట విద్యుత్ కనెక్షన్ తీసుకోకుండా పొరుగు ఇంటి నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలా ప్రభుత్వాదాయానికి కూడా గండి కొడుతున్నారని వివరించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సింగరేణి 'పవర్ ఉమెన్' సాయిలతకు సన్మానం



సన్మానిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన సింగరేణి ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సాయిలతను శనివారం సన్మానించారు. ఏరియా హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌తో పాటు పలువురు సన్మానించారు. ఏసీఎంవో కిరణ్‌రాజు, ఎన్టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, లక్ష్మీపతి, వడ్డెపల్లి దాస్, సదానందం, ఆస్పత్రి సిబ్బంది రత్నమాల, ఉన్నితన్ పాల్గొన్నారు.

రోజువారీ సంతకు మోక్షమెన్నడో?

- మందుబాబులకు అడ్డాగా మార్కెట్ షెడ్లు
- ఆరేళ్లయినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అందుబాటులోకి తీసుకురావాలని స్థానికుల వినతి



నిరుపయోగంగా మార్కెట్ షెడ్లు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజలకు తాజా కూరగాయలు అందించాలన్న ఉద్దేశంతో యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తా సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద గల స్థలంలో 2018లో అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ దాదాపు రూ.65లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. మధ్యలోనే పనులు ఆగిపోవడంతో తర్వాత వచ్చిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తిరిగి పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుత మార్కెట్ షెడ్లు నిర్మించి వదిలేశారు.

ప్రహరీ లేకపోవడంతో..

మార్కెట్ చుట్టూ గోడ నిర్మించకపోవడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా షెడ్లలో మద్యం సేవిస్తున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో అటు వైపు వెళ్లాలంటే మహిళలు భయపడుతున్నారు. మందుబాబులు మద్యం సేవించడంతో పాటు అక్కడే మూత్ర విసర్జన చేయడంతో చుట్టుపక్కల ఇళ్లలో ఉండేవాళ్లు, రోడ్డుపై వెళ్లేవారు దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకొని డెయిలీ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా మార్కెట్ షెడ్లు..

ఆరేళ్ల క్రితం నిర్మించిన మార్కెట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోజువారీ సంతను ప్రజా నాయకులు, సంబంధిత అధికారులు పట్టించుకొని రోజువారీ సంతను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



రోజువారీ సంత లేకపోవడంతో తాజా కూరగాయలు కావాలంటే ప్రజలకు కష్టంగా మారింది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోజువారీ సంతను అందుబాటులోకి తీసుకురావాలి.

– కుడికల సత్యవతి, యైటింక్లయిన్‌కాలనీ

అందరికీ సౌకర్యంగా ఉంటుంది



డెయిలీ మార్కెట్ ప్రారంభిస్తే కాలనీ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నివిధాలా సౌకర్యంగా ఉంటుంది. అన్ని రకాలు కూరగాయలు ఒకే చోట దొరుకుతాయి.

– ఎ.రజిత, యైటింక్లయిన్‌కాలనీ

మూడునెలల్లో అందుబాటులోకి తెస్తాం



త్వరలోనే మరికొన్ని నిధులు మంజూరు చేస్తాం. మార్కెట్‌లోని నిరర్మాణ పనులను, పెండింగ్ పనులను పూర్తి చేసి మూడు నెలల్లోనే అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడతాం.

– శ్రీకాంత్, రామగుండం మున్సిపల్ కమిషనర్

జిల్లాలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

సుల్తానాబాద్: జిల్లాలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టెముక్కల సురేశ్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని ఓ రైస్‌మిల్‌లో ఆరేళ్ల పాపను గంజాయి మత్తులో అత్యాచారం, హత్య చేసిన నిందితుడికి వెంటనే శిక్షపడేలా చేయాలంటే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుతోనే సాధ్యమవుతుందన్నారు. దీనిపై కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్, మండల ప్రధాన కార్యదర్శులు నల్లవెల్లి శంకర్, నర్సింగోజు రమేశ్‌చారి, కొమ్మిడి కుమార్‌రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మల్కా భాగ్యలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు సాయిచరణ్, వెంకటేశ్, మారం రమేశ్ చిన్న, వేణుయాదవ్, వేణు, సతీశ్, సంపత్, సాయి ఉన్నారు.

కార్మికులే నాకు కొండంత అండ



మాట్లాడుతున్న కౌశిక హరి

పాలకుర్తి: 'రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం 20ఏళ్లుగా పోరాడుతున్నానని, కార్మికులే నాకు కొండంత అండ' అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కౌశికహరి అన్నారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో 18న జరగనున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కంపెనీ ఆవరణలో మాట్లాడారు. తమ ప్యానెల్‌ను గెలిపిస్తే కార్మికులకు సేవకుడిగా పనిచేస్తామన్నారు. కంపెనీలో అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్ వ్యవస్థను రద్దు చేసి అందరినీ స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించి సీనియారిటీ ఆధారంగా హైస్కిల్డ్ వేతనాలు అందిస్తామన్నారు. 18న జరగనున్న ఎన్నికల్లో మోటార్ సైకిల్ గుర్తుపై ఓటువేసి మాదాసు శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రధాన కార్యదర్శి అభ్యర్థి మాదాసు శ్రీనివాస్, నాయకులు పెరుమాండ్ల రమేశ్, వేల్పుల సంపత్, బత్తిని సతీశ్‌గౌడ్‌తో పాటు కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేశోరాంలో అవినీతిరహిత పాలన అందిస్తాం



మాట్లాడుతున్న బయ్యపు మనోహర్‌రెడ్డి

పాలకుర్తి: బసంత్‌నగర కేశోరాం సిమెంట్ కర్మాగారంలో 18న జరగనున్న కాంట్రాక్ట్ కార్మికసంఘం ఎన్నికల్లో తమ ప్యానెల్‌ను గెలిపిస్తే అవినీతిరహిత పాలన అందిస్తామని పర్మినెంట్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ కార్మికసంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కంపెనీ ఆవరణలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో పనిచేసిన యూనియన్ నాయకులు విపరీతమైన అవినీతికి పాల్పడి ఎన్నికల్లో పోటీచేయలేని పరిస్థితి తెచ్చుకున్నారన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం, పెద్దపల్లి, ధర్మపురి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో కార్మికుల హక్కులు సాధించి వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం జరగనున్న ఎన్నికల్లో ఆటోగుర్తుపై ఓటువేసి నగునూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కేశోరాం పర్మినెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, కన్నాల ఎంపీటీసీ అతిఖ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ సర్పంచులు బదావత్ రాజునాయక్, మల్లెత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ బూడిదవ్యాప్తిపై చర్యలు తీసుకోవాలి



రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని కమ్మేసిన బూడిద

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలోనే ఉన్న ఎన్టీపీసీ బూడిద చెరువు నుంచి శుక్రవారం వీచిన భారీ ఈదురుగాలులతో ఒక్కసారిగా బూడిద రైల్వేస్టేషన్ ఏరియాను కప్పేసింది. రైల్వేస్టేషన్ ఎదుట చిన్న హోటళ్లు, మినరల్ వాటర్ విక్రయించే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమోసా, మిర్చి, వడ తదితర టిఫిన్లపై బూడిద పూర్తిగా నిండిపోవడంతో పడేశారు. అదే సమయంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రామగుండం చేరుకోగా వాహనాలకు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ స్పందించి బూడిద తీవ్రతను తెలిపే వీడియోతో లిఖితపూర్వకంగా జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం సైతం ఈదురుగాలులకు అవకాశం ఉన్న మే, జూన్ నెలల్లో బూడిద లేవకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని కోరారు. బూడిద వ్యాప్తి నివారణకు ఎన్టీపీసీ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పెండ్రు రమ

మంథని: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజల్ని అప్రమత్తం చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు సూచనలు చేయాలని, మున్సిపాలిటీ నుంచి చేపట్టే చర్యలు తీసుకోవాలన్నారు. 20, 21 తేదీల్లో నిర్వహించే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ ఉన్నారు.

కేజీబీవీలో భద్రతతో కూడిన విద్యాబోధన



ఎస్‌వోను సన్మానిస్తున్న కందుల సంధ్యారాణి

రామగుండం: బాలికలకు భద్రతతో కూడిన విద్యాబోధనతో పాటు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన బాలికలను అక్కున చేర్చుకొని విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు అంటూ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి అన్నారు. కుందనపల్లి కేజీబీవీ ఇటీవల పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై స్పెషల్ ఆఫీసర్ ఉదయశ్రీని శనివారం ఆమె అభినందించారు. ఎస్‌వోను సత్కరించారు. బీజేపీ ప్రతినిధులు సిద్ధ లింగయ్య, చిలువేరు కుమార్, బూడిద హర్ష, శ్రీకాంత్, మహేశ్, అశోక్, ఉపాధ్యాయులు రేణుక, శకుంతల, లలిత, స్వప్న, సుజాత, శ్రీవాణి, చంద్రకళ, వనిత, మనీశ్వరి, కళ్యాణి, కవిత, సరిత, అరుణజ్యోతి, శోభారాణి ఉన్నారు.

కేశోరాం కార్మికులకు సుపరిపాలన అందిస్తాం

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో 18న జరగనున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఎన్నికల్లో తమను గెలిపిస్తే కార్మికులకు సుపరిపాలన అందిస్తామని స్వతంత్ర అభ్యర్థి కాల్వ నరేశ్ అన్నారు. బసంత్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బుట్టి దామోదర్, కాల్వ సంపత్, బుట్టి మీనయ్య పాల్గొన్నారు.

చిన్నారికి కొవ్వొత్తులతో నివాళి



ఫెర్టిలైజర్‌సిటీ: పెద్దపెల్లి జిల్లా కాట్నపల్లిలో ఆరేళ్ల బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్తగేట్‌లో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బేబీ సహస్రకు నివాళి అర్పించారు.

నులి పురుగును నివారిద్దాం

ఎలిగేడు: నులి పురుగును నివారిద్దామని మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా అన్నారు. 20న జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ముందస్తుగా మండల లెవల్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, నాగమణి, లక్ష్మన్, రాజేశ్వరిదేవి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పారదర్శకంగా ప్రాక్టికల్స్

గోదావరిఖని: సింగరేణిలో అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని రామగుండం-1 ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్జీ-1 ఏరియాలోని 330 మంది ఉద్యోగులు ఈపీ ఆపరేటర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికి ఇటీవల హాల్‌టికెట్లు జారీ చేశామన్నారు. వీరికి ఈనెల 18 - 20వ తేదీ వరకు స్థానిక జవహర్‌లాల్ క్రీడా ప్రాంగణంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్మాతని చెప్పారు. అర్హత సాధించిన వారికి ఈనెల 30న కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో రాత పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు సకాలంలో ప్రాక్టికల్స్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

జ్యోతినగర్: ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్ హెచ్చరించారు. రాజీవ్ రహదారిపై సిబ్బందితో కలిసి ఆయన శనివారం వాహనాలు తనిఖీ చేశారు. రామగుండం యూనిట్ పరిధిలో 66 బస్సులు ఉన్నాయని, వాటిలో 60 బస్సులకు ఫిట్నెస్ ఉందన్నారు. మిగతా వాటికి సత్వరమే ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. నిబంధలను పాటించని రెండు వాహనాలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

హైకోర్టు తీర్పును అమలు చేసేలా చూడండి

సుల్తానాబాద్: హైకోర్టు తీర్పును అమలు చేసేలా చూడాలని మండల విశ్వహిందూ పరిషత్ సహాయ కార్యదర్శి కొమ్మిడి కుమార్‌రెడ్డి మినీ కలెక్టరేట్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లి గేట్‌లో భర్త, కొడుకు, కోడలిని కోల్పోయి టీ స్టాల్ నడుపుతూ మనుమడు, మనవరాలను చదివిస్తున్న కత్తుల రమణమ్మకు శనివారం వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.7500 అందజేశారు. వీహెచ్ఆర్ 14వ డివిజన్ ఇన్‌చార్జి ముత్యాల ప్రవీణ్‌కుమార్, భానుచందర్ మల్లయ్య, రాజేశ్, రాజయ్య ఉన్నారు.

కాల్వను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ నుంచి రాజాపూర్ శివారులోని సుద్దకుంట ప్రాంతానికి సాగునీరు అందించే కాల్వను పూడ్చిన బొంతల ఓదెలుపై చర్యలు తీసుకోవాలని రైతులు శనివారం తహసీల్దార్ ఆరిఫొద్దిన్‌కు ఫిర్యాదు చేశారు. కాల్వను పూడ్చడంతో పంటలు సాగు చేసుకునేందుకు సాగునీరు అందక బీడు భూములుగా మారే పరిస్థితి నెలకొందని, సర్వే చేయించి కాల్వను తీయించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. శరత్‌కుమార్, నాగరాజు, రమేశ్, రవి, సంపత్ ఉన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

గోదావరిఖనిటౌన్: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రీతం మండల విద్యాధికారికి శనివారం వినతిపత్రం అందించారు. రాహుల్, శ్రీకాంత్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి

ఓదెల: అర్హులైన టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని మడక ప్రభుత్వ పాఠశాలలో ఎస్టీటీ ఫోరం, ప్రైమరీ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు.

మచ్చుపేటలో కళాకారుల ప్రదర్శన

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం బడిబాట, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కళాకారులు శంకర్‌గౌడ్, మల్లేశ్, పద్మ, రాజనర్సు, రాజన్న, శ్రావణ్, రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక ప్రాంత పరిధి 27వ డివిజన్ గోదావరిఖని బస్టాండ్ కాలనీకి చెందిన మాదరవేణి మంజుల-రమేశ్ దంపతుల కుమారుడు అజయ్‌కుమార్‌కు జమ్మూకశ్మీర్‌లో సైనికుడిగా నియామకమయ్యాడు. మద్రాస్ రెజిమెంట్లో సైనిక శిక్షణ పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన అజయ్‌కుమార్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

సింగరేణి అధికారుల బదిలీలు చేపట్టాలి

రామగిరి: సింగరేణి అధికారుల బదిలీలు వెంటనే చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల తర్వాత బదిలీ చేయాలని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుర్తింపు సంఘాల అండదండలతో లాంగ్ స్టాండింగ్‌లో కొందరు అధికారులు ఒకే డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల అండదండలతో కొందరు అధికారులు మంచి పోస్టింగ్‌లు పొందుతున్నారని, నిజాయితీగా పనిచేసే అధికారులకు న్యాయం జరగడం లేదన్నారు. అధికారుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని, లేనిపక్షంలో బీజేపీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ సేవా సమాజ్ ఆధ్వర్యంలో పూజలు



పూజల్లో సేవాసమాజ్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలోని శ్రీహనుమాన్ ఆలయంలో శనివారం మార్వాడీ సేవాసమాజ్ అధ్యక్షుడు ఘన్‌శ్యాందాస్ శారడ, రాజస్థానీ మహిళా మండలి అధ్యక్షురాలు స్నేహలత మాలానీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహేశ్ నవమి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో శివాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో బాల్‌కిషన్ జాకోటియా, కమల్ కిషోర్ శారడ, శ్రీనివాస్ కాంకానీ, విష్ణుమాలానీ, మనోజ్‌శారడ, జగదీశ్ అట్టల్, శ్యాం తోత్లా, రమేశ్ సోని ఉన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అలీం

రామగుండం: వర్షాకాలంలో ప్రజలకు అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎంఏ.అలీం అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభకు హాజరై పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రధానంగా గ్రామంలోని డ్రైనేజీల్లోని పూడికను తొలగించి నీటి సరఫరాను మెరుగుపరచాలని, వివిధ ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలోని తాగునీటి బావులు, బోర్లలో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. ఇందుకోసం ప్రతి గురువారం క్లీనింగ్ డేగా పరిగణించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఎంపీటీసీ కొలిపాక శరణ్య, కార్యదర్శి రఘు, ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్: కోకాకోలా కంపెనీతో రూ.700కోట్ల పెట్టుబడితో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు తీసుకువస్తున్నందుకు రుణపడి ఉంటామన్నారు. తిరుపతి, మోహన్, సత్యనారాయణ, ముస్తాక్, నర్సగౌడ్, రాంచంద్రం గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

బసంత్‌నగర్ ఎస్సైకి సన్మానం



ఎస్సై స్వామిని సన్మానిస్తున్న నాయకులు

పాలకుర్తి: బీజేపీ నాయకులు శనివారం బసంత్‌నగర్ ఎస్సై స్వామిని సన్మానించారు. కొన్నిరోజులుగా గోవులను గోవధకు తరలిస్తున్న వాహనాలను పట్టుకుని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఆవులను గోశాలకు తరలించిన నేపథ్యంలో ఎస్సై స్వామి, రెండో ఎస్సై శివాణిరెడ్డి, కన్నాల టోల్‌ప్లాజా వద్ద గస్తీ నిర్వహిస్తున్న డిస్టిక్ గార్డ్స్‌ను సత్కరించారు. ఈసారపు శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్షక్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రమేశ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమిరె లక్ష్మణ్, ఆడెపు రమేశ్, గడ్డం శ్రీనివాస్, రంగు సంతోష్, నక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.